క్లుప్తంగా

నేడు స్వచ్ఛతా హి సేవ

కలికిరి: కలికిరి సమీపంలోని పాళెం వద్దనున్న ఐటీబీపీ 53వ బెటాలియన్, సీఆర్‌పీఎఫ్ (సీఐఏటీ–3) బెటాలియన్‌ల ఆధ్వర్యంలో గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయనకు నివాళులుగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలలో ఆదివారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయా బెటాలియన్ అధికారులు తెలిపారు.

హుండీ ఆదాయం లెక్కింపు

నిమ్మనపల్లె: మండలంలోని తవళం నేలమల్లేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.54 వేలు వచ్చినట్లు ఈఓ మంజుల, మదనపల్లె గ్రూప్ టెంపుల్స్ ఈఓ రమణ తెలిపారు. శనివారం ఆలయంలో తాత్కాలి కమిటీ సభ్యులచే హుండీలోని నగదు (మూడు నెలలు) గాను లెక్కించారు. రూ.54,486 ఆదాయం రాగా, నగదును ఆలయ బ్యాంకు అకౌంట్‌లో జమచేయనున్నట్లు తెలిపారు. ఈ నిధులు ఆలయ అభివృద్ధికి చెప్పారు. మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డి, కమిటీ సభ్యులు గోపాలకృష్ణ, రవి, శంకర, రవీంద్ర, అర్చకులు నాగస్వామి పాల్గొన్నారు.

131 లీటర్ల సారా నిర్వీర్యం

పీలేరు రూరల్ : వివిధ కేసుల్లో పట్టుబడిన 131 లీటర్ల సారాను నిర్వీర్యం చేసినట్లు సెబ్ సూపరింటెండెంట్ వి. శ్రీనివాసులు అన్నారు. శనివారం పీలేరు పట్టణం శివారు ప్రాంతంలో సుమారు రూ. 26 వేలు విలువైన సారాను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 కేసుల్లో పట్టుబడిన సారా నిర్వీర్యం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సెబ్ సీఐ గురుప్రసాద్ ఎస్ఐ లక్ష్మీనరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా విజయ్‌రెడ్డి



పీలేరు : మండల డిప్యూటీ తహసీల్దార్‌గా విజయ్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. తిరుపతిలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న విజయ్‌రెడ్డి పదోన్నతిపై పీలేరుకు వచ్చారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా బాధ్యతలు స్వీకరించారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

ములకలచెరువు: మనిషికి డబ్బు, ఆస్తుల కంటే ప్రధానమైనది ఆరోగ్యమేనని ఎంపీపీ సాయి లీలా, సర్పంచ్ మంజుల అన్నారు. శనివారం మండలంలోని పాతములకలచెరువులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధిగ్రస్తులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసి పౌష్టికాహార ప్రదర్శనను ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బ్రహ్మజీ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం జరిగిన స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి నెట్ బాల్ పోటీల్లో అండర్ 14 విభాగంలో టి. సాయిప్రకాష్, అండర్ 17 విభాగంలో ఎం. హరీష్‌కుమార్‌రెడ్డి ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. శనివారం పాఠశాల సందర్శనకు విచ్చేసిన ఏపీఆర్‌ఈఐ సొసైటీ జాయింట్ సెక్రటరీ ఉబేదుల్లా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ పురుషోత్తం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహాజన సభ వాయిదా

బి.కొత్తకోట: మండలంలోని హార్సిలీ హిల్స్ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ మహాజనసభ శనివారం హార్సిలీ హిల్స్‌పై నిర్వహించగా సభ్యులు డుమ్మా కొట్టారు. 500 మందికి పైబడి సభ్యులు ఉన్న ఈ సంఘంలో కీలకమైన సభకు హాజరు కాకపోవడంతో ఈ సమావేశాన్ని నిబంధనల మేరకు వారం రోజుల్లో మళ్లీ నిర్వహిస్తామని సంఘం కార్యదర్శి రాజేంద్రప్రసాద్ రెడ్డి తెలిపారు. సభకు సభ్యులు హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. కేవలం ఐదుగురు సభ్యులు మాత్రమే హాజరయ్యారు. దీనితో సభ నిర్వహణ వాయిదా పడింది.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి

పీలేరు : విద్యార్థులు చదువుతో పాటు పోటీతత్వం అలవర్చుకోవాలని ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీమ్‌అస్లామ్, రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ అన్నారు. శనివారం స్థానిక ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని ఏడు ఉర్దూ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన 27 మంది విద్యార్థులకు ప్రతిభా అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ముస్లిం మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉర్దూ పాఠశాలల అభివృద్ధికి తమవంతు సహకారం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి, నాయకులు అబీద్, మునీర్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షులు

మదనపల్లి(ము)(సి–2) : ఉదయ్‌కుమార్
తంబళ్లపల్లె : ఆర్.చొడేశ్వర్
బి.కొత్తకోట(నగరపాలిక): చిన్నికృష్ణ

ప్రతి పేదవాడికీ కార్పొరేట్ స్థాయి వైద్యం

- జగనన్న ఆరోగ్య సురక్షకు భారీ స్పందన
- అందరికీ ఆరోగ్య కార్డులు పంపిణీ
- ఉచితంగా మందులు పంపిణీ





కురబలకోట: జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ , పీలేరు: శివరామపురంలో వైద్య శిబిరం

కలికిరి: ప్రతి పేదవాడికీ కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని ఎంపీ పీవీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. కలికిరి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం మండల స్థాయి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ గతంలో పేదలు వైద్య సేవలకు లక్షలు వెచ్చించాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం పేదల ఇంటి వద్దచే వైద్య సిబ్బంది వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం, మందులు ఉచితంగా అందిస్తారన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ తిమ్మారెడ్డి, మండల పార్టీ కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, వైద్యాధికారులు చిన్నరెడ్డెప్ప, కావ్యగంధ, హిమబిందు, రమేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్యం

మదనపల్లె : ప్రజలందరి ఆరోగ్య రక్షణ లక్ష్యంగా సీఎం జగనన్న ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం చేకూరుతుందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శనివారం పట్టణంలోని నీరుగట్టువారిపల్లె మాయాబజార్ వివేకానంద మున్సిపల్ పాఠశాలలో అమ్మచెరువుమిట్ట యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా హాజరై శిబిరంలో ప్రజలకు అందుతున్న వైద్యసేవలు, జరుగుతున్న పరీక్షలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం , కమిషనర్ కే.ప్రమీల, ఏఈ బండపల్లిశిరీషా, స్పెషల్‌ఆఫీసర్ జయరాం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతుడే నిజమైన సంపన్నుడు

కురబలకోట: ఆరోగ్యవంతులే నిజమైన సంపన్నులని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి. చంద్రానాయక్ అన్నారు. శనివారం నందిరెడ్డిగారిపల్లె (బండపల్లె) విలేజ్ క్లీనిక్ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా సీఎం జగన్ జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారన్నారు. డాక్టర్లు కూడా సంతృప్తికరమైన సేవలు అందించాలన్నారు. ఉచిత ఆరోగ్య పరీక్షలు, సేవలు పేద, మధ్య తరగతి వారికే కాకుండా ప్రతి ఒక్కరికీ వరమన్నారు. ఉచింతంగా మందులు, మాత్రలు అందజేశారు. తహసీల్దారు భీమేశ్వరరావు, బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, భూదేవి, ఏఓ రాధ, మదార్ సాబ్, కార్యదర్శి సఫీయా, ఎపీఎం నీరజ, బండపల్లె కృష్ణారెడ్డి, ఏపీఓ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పాలిట వరం

బి.కొత్తకోట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల పాలిట వరంగా మారింది. శనివారం బి.కొత్తకోట నగర పంచాయతీ ఒకటవ సచివాలయం పరిధిలో ఈ కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. ఏడుగురు వైద్యులు, 30 మంది వైద్య సిబ్బంది ప్రజలకు వైద్య సేవలు అందించారు. కమిషనర్ పి.ఆర్. మనోహర్ కార్యక్రమం కోసం వైద్య పరీక్షలకు ప్రత్యేక కౌంటర్లు, మందులు పంపిణీకి వేర్వేరు కౌంటర్లు ఏర్పాటు చేయించారు. తొలి రోజు ఒక సచివాలయం పరిధిలోనే 400 మంది ప్రజలు హాజరై వైద్య పరీక్షలు ఉచితంగా చేయించుకున్నారు. మూత్ర, గళ్ళ, డయాబెటిస్, బీపి, కంటి, రక్తహీనత, మలేరియా, డెంగ్యూ తదితర పరీక్షలు నిర్వహించారు. సిహెచ్ సీ మెడికల్ ఆఫీసర్ కిరణ్ కుమార్, వైద్యులు డాక్టర్ శంకర్, విమల, మొహిద్దీన్, గౌతమి, రాధిక, నగేష్ లు ప్రజలకు వారి వ్యాధికి సంబంధించిన పరీక్షలు నిర్వహించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్డుల్లో వివరాలు నమోదు చేసి ఇచ్చారు.

నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం

పెద్దమండ్యం: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి వారికి నాణ్యమైన వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని జెడ్పీటీసీ పీరమ్మ అన్నారు. మండలంలోని సీ గొల్లపల్లె పంచాయతీ కనుమలోపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు స్పెషలిస్ట్ డాక్టర్ల సేవలు అందించేందుకు గ్రామీణ ప్రాంతాలలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నలుగురు వైద్యుల బృందం ప్రజలకు, రోగులకు చికిత్స అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. క్యాంప్‌ను మండల ప్రత్యేక అధికారి రవి పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాము, ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఎంఈవో మనోహర, డాక్టర్‌లు ఇమ్మాన్యుల్, హరివర్మ, నజ్మ, ప్రవీణ్, సిహెచ్‌వో క్రిష్ణయ్య, ఈవోపీఆర్‌డి జనార్దన్, వైస్ ఎంపీపీ శారదమ్మ, ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్, గ్రామ సర్పంచ్ కంటి విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

పెద్దతిప్పసముద్రం: ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, సచివాలయ కన్వీనర్ డ్రిప్ రమణ అన్నారు. మండలంలోని ముంతపోగులవారిపల్లిలో శనివారం ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వైద్య వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకు రావడంలో దేశం మొత్తం ఏపీ రాష్ట్రం వైపు చూసేలా జగనన్న ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వైద్య శిబిరానికి 435 మంది వివిధ జబ్బులు హాజరై ఉచితంగా చికిత్స పొందారు. వైద్య నిపుణులు పురుషోత్తం నాయక్, రాజశేఖర్, స్టీఫెన్, సునీల్‌లతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, సచివాలయ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మనపల్లెలో..

నిమ్మనపల్లె: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు వరమని డీఎల్‌డీఓ లక్ష్మిపతి అన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఎంపీడీఓ శేషగిరిరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీపీ నరసింహులు, మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డిలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రామసముద్రంలో..

రామసముద్రం: మండలంలోని అరికెల, మానేవారి పల్లె పంచాయతీల్లో శనివారం జగనన్న సురక్షా కార్యక్రమం నిర్వహించినట్లు మండల ప్రత్యేకాధికారి కృష్ణమూర్తి , ఎంపీడీవో నారాయణస్వామి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్షా కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీపీ కుసుమ కుమారి, సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబరు కొండూరుకృష్ణారెడ్డి , వైస్ ఎంపీపీ రమణరెడ్డి, మండల కన్వీనర్ నందరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర మంతటా జగనన్న సురక్ష అనే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు.

అందరికీ ఆరోగ్యం

పీలేరు : జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ మురళీమోహన్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని శివరామపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచితంగా వైద్య పరీక్షలు, ఉచితంగా కళ్ల అద్దాలు, ఉచితంగా మందులు తోపాటు ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సుమారు 200 మందికి ఉచిత వైద్యసేవలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ లక్ష్మీప్రసన్న, డాక్టర్ జావిద్, డాక్టర్ శివయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కలకడలో..

కలకడ : పేదలకు ఉచిత వైద్యం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయంగా పనిచేస్తున్నారని ఎంపీపీ శ్రీదేవి, సింగల్‌విండో అధ్యక్షులు వెంకట్రమణరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కె.బాటవారిపల్లె ఉన్నతపాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం ప్రారంభించి ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రదీప్, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, మోహన్‌రాజ, తదితరులు పాల్గొన్నారు.



బి.కొత్తకోట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్డులు అందిస్తున్న కమిషనర్ మనోహర్, వైద్యులు



నిమ్మనపల్లె: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ లక్ష్మిపతి



పెద్దమండ్యం: వైద్యసేవలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ, అధికారులు

పేదలకు వరం

కేవీపల్లె : జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం లాంటిదని ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తీతవగుంటపల్లె గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. స్పెషలాఫీసర్ విశ్వనాథ్, వైద్యాధికారిణి పావనిగౌరి, ఎంపీపీ ఈశ్వరమ్మ, సర్పంచ్ వీరకుమార్, మాజీ సర్పంచ్ తిమ్మారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

తంబళ్లపల్లె: ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ స్కందప్ప తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను శనివారం బలవారిపల్లె ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ అనుపమ, డాక్టర్ మునికుమార్, ప్రత్యేక వైద్య నిపుణులు లుమితింగ్ల, చరణ్‌లు పలువురికి వైద్య పరీక్షలు, చికిత్సలు చేసి మందులు అందజేశారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిని ఉషశ్రీ, ఎంపీడీఓ సురేంద్రనాథ్, సర్పంచు వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ అప్పిరెడ్డి, మల్‌రెడ్డి పాల్గొన్నారు.











రామసముద్రం: మానేవారిపల్లెలో జగనన్న సురక్ష వైద్యశిబిరం, కేవీపల్లె : తీతవగుంటపల్లెలో వైద్యశిబిరం, కలకడలో జగనన్న సురక్ష కార్డు అందజేస్తున్న ఎంపీపీ శ్రీదేవి, మదనపల్లె: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ స్టాల్, తంబళ్లపల్లె: మాట్లాడుతున్న నారాయణరెడ్డి

నాలుగన్నరేళ్లలో కనీవినీ ఎరుగని అభివృద్ధి

- మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- నెరవేరిన పారిశుధ్య కార్మికుల 20 ఏళ్ల కల
- పారిశుధ్య కార్మికులకు ఎంపీ, ఎమ్మెల్యే చేతులమీదుగా ఇంటి పట్టాల పంపిణీ



కార్మికులకు ఇంటిపట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : వైఎస్సార్ సీపీ నాలుగన్నరేళ్ల పాలనలో మదనపల్లె నియోజకవర్గ చరిత్రలో కనీవినీ ఎరుగని అభివృద్ధి జరిగిందని, ప్రజలకు మంచి చేసిన ప్రభుత్వాన్ని, సీఎం జగనన్నను ఆశీర్వదించాలని ఎంపీ మిథున్‌రెడ్డి కోరారు. శనివారం సాయంత్రం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. మున్సిపల్ జనరల్ ఫండ్స్ నిధుల నుంచి రూ.8లక్షలు వెచ్చించి రాష్ట్రంలో గుంటూరు కార్పొరేషన్ తర్వాత మదనపల్లె మున్సిపాలిటీలో కార్మికులకు ప్రమాదబీమా బాండ్లను అందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా, చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ..మదనపల్లె పట్టణ ప్రజలు ఆరోగ్యంగా, ఊరు పరిశుభ్రంగా ఉండంటే పారిశుద్యకార్మికుల రెక్కల కష్టమేనన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టే కార్మికులకు జగనన్న ఆశీస్సులతో ఇంటిపట్టాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. కార్మికులకు మంజూరుచేసిన స్థలంలో అన్నివసతులతో చక్కని లేఅవుట్‌ను ఏర్పాటుచేసి, ఇళ్లు కట్టుకునేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో సహకారం అందిస్తామన్నారు. మున్సిపల్ వర్కర్స్ కాలనీకి ఎంపీ మిథున్‌రెడ్డి కాలనీగా నామకరణం చేస్తామన్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులకు జగనన్న కాలనీగా ఏర్పాటుచేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాక ప్రతి కార్మికుడి ఇంటికి వచ్చి భోజనంచేసి వెళతానని మాట ఇచ్చారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ..కరోనా సమయంలో పారిశుధ్య కార్మికుల సేవలు అమూల్యమైనవని, ఎంపీ మిథున్‌రెడ్డి వారికి ఇచ్చిన హామీని నిలుపుకుంటూ ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా కార్మికులు ఇంటిపట్టాల కోసం ప్రభుత్వాలకు వినతులు ఇస్తూనే ఉన్నామని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా సహకారంతో తమ కోరిక నెరవేరడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉదయ్ కుమార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బాబ్‌జాన్, ఆర్డీఓ ఎం.ఎస్.మురళి, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, 35వార్డుల కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిపథంలో మదనపల్లె..

రాజంపేట పార్లమెంటరీ పరిధిలో ఏర్పాటు చేస్తున్న మదనపల్లె మెడికల్ కళాశాల పనులు శరవేగంగా సాగుతున్నాయని, వచ్చే ఏడాది నుంచి మొదటిబ్యాచ్ ప్రారంభమవుతుందని ఎంపీ తెలిపారు. విద్యార్థులు స్థానికంగానే వైద్యవిద్యను అభ్యసించేందుకు వీలవుతుందన్నారు. అలాగే బీటీ కళాశాలను ప్రభుత్వ స్వాధీనం తర్వాత యూనివర్సిటీ ఎస్టిమేట్లు ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు పంపామని, క్యాబినెట్‌లో క్లియర్ అయ్యాక ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మదనపల్లె–తిరుపతి, అనంతపురం ప్రధానరహదారులను ప్రజల సౌకర్యార్థం నాలుగులేన్ల రహదారిగా మార్పు చేశామని, పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఐదేళ్లలో మదనపల్లె నియోజకవర్గంలో వేసిన రోడ్లుకు నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో వేసిన రోడ్లు పదింతలు ఉంటేనే వైఎస్సార్ సీపీకి ఓటువేయాలన్నారు. రూ.230 కోట్లతో నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు రోడ్లు వేయడం జరిగిందని ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు.

జలకళ రైతులకు మోటార్లు అందజేత

కలికిరి: జలకళ పథకంలో భాగంగా బోర్లు వేసిన రైతులకు ప్రభుత్వం అందజేసిన మోటార్లను పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సీఎల్‌ఆర్‌సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో ప్రస్తుతం జలకళ పథకానికి బోర్లు వేయడానికి బోరులారీ యజమానులు ముందుకు రావడంలేదని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలో జలకళ పథకంలో రైతులకు ఉచిత బోర్లు వేయించడానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. మొదటి విడతలో పీలేరు నియోజకవర్గంలో 118 మంది రైతులకు బోర్లు వేయగా వీరికి ప్రభుత్వం పూర్తి ఉచితంగా మోటారు, స్టార్టరు, పైపులు మొత్తం రూ.6.5 లక్షలు విలువ చేసే వస్తువులను మంజూరు చేయడం జరిగిందన్నారు. అనంతరం రైతులకు మోటార్లును అందజేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ మద్దిలేటి, కలికిరి క్లస్టర్ ఏపీడీ మధుబాబు, ఏపీఓ సుజాత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, గంగయ్య, ఎంపీటీసీ సభ్యురాలు షాహీన తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో రికవరీకి ఆదేశం



సామాజిక తనిఖీ భహిరంగ సభలో అధికారులు

ములకలచెరువు: ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీలో రూ. 23,265 వేలు రికవరీకి డ్వామా ఏపీడీ ప్రతాప్ ఆదేశించారు. శనివారం స్థానిక సీఎల్‌ఆర్‌సీ భవనంలో ఎంపీడీఓ పోలప్ప అధ్యక్షతన సమాజిక తనిఖీ భహిరంగ సభ నిర్వహించారు. మండలంలో 1–4–2022 నుంచి 31–3–2023 వరకు జరిగిన ఉపాధిహామీ, పీఆర్ శాఖల ద్వారా జరిగిన 1748 పనులకు గాను రూ.9 .62 కోట్ల నిధులు ఖర్చు చేశారు. ఈ ఖర్చుపై మండలంలోని 16 పంచాయతీల్లో 20 రోజుల పాటు 15 మంది డీఆర్‌పీలు క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించారు. కూలీలు చేపట్టిన పనుల్లో కొలతల్లో వచ్చిన తేడా, మస్టర్లలో వచ్చిన తేడాల కారణంగా రూ.19,765 వేలు రికవరీకి ఆదేశించి రూ.3500 జరిమాన విధించారు. మొత్తం రూ. 23,265 వేలు సీఆర్‌డీ ఆసిస్ బ్యాంక్ ఖాతాలో జమచేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ జగదీష్‌కుమార్, డీపీవో ప్రకాష్, ఏపీడీ నందకుమార్‌రెడ్డి, ఎంపీడీఓ పోలప్ప, మండల ప్రత్యేకాధికారి గురుప్రసాద్, ఎంపీపీ సాయిలీలా, వైఎస్ ఎంపీపీ మల్లికార్జున, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎన్‌ఆర్‌జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణ పనులను అడ్డుకుంటున్నారని ఫిర్యాదు



తహసీల్దార్ ఖాజాబీకి ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

గుర్రంకొండ: రిటైర్డ్ ఉపాధ్యాయుడు, ఆయన భార్య ప్రస్తుత ఉపాధ్యాయురాలు కలసి అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను అడ్డుకుంటున్నారని గ్రామస్తులు తహసీల్దార్ ఖాజాబీకి ఫిర్యాదు చేశారు. శనివారం జెడ్పీటీసీ సమ్రీన్ ముక్తియార్, మండల ఆర్బీకే డైరెక్టర్ మురాషా ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని లిఖిత పూర్వకంగా సమస్యపై ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని తాళీంవీధిలో ప్రస్తుతం ఎలాంటి సౌకర్యాలు లేని అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వం సొంత భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. సర్వేనెంబరు 277లో 05 సెంట్లు ప్రభుత్వం స్థలంలో భవన నిర్మాణ పనులు చేపట్టారన్నారు. తహసీల్దార్ కూడా ఇక్కడ భవనం నిర్మించుకోవచ్చని అనుమతి కూడా ఇచ్చారన్నారు. అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు పూర్తికావస్తున్న సమయంలో గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు యూసూఫ్ సాహేబ్, ఆయన భార్య పర్వీన్ అడ్డుకొంటున్నారన్నారు. ఈవిషయమై విచారణ జరిపి న్యాయం చేసి వెంటనే భవన నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ గణేష్, హౌస్‌ఫెడ్ కార్యదర్శి గయాజ్, వార్డు సభ్యులు ఇర్షాద్, అన్వర్,నాయకులు శంకర, శోభనాల రమేష్, రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.


పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి

కేవీపల్లె : సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ కోరారు. సీపీఎస్ ఉద్యోగస్తులకు తీసుకొస్తున్న జీపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ శనివారం స్థానిక ఎమ్మార్సీ వద్ద నల్ల బెలూన్స్‌తో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. యూటీఎఫ్ నాయకులు , ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

ఆటోలకు రికార్డులు తప్పనిసరి

ములకలచెరువు: ప్రయాణికులను నడిపే ఆటోలకు రికార్డులు తప్పనిసరిగా ఉండాలని డ్రైవర్లకు సీఐ తమ్మిశెట్టి మధు ఆదేశించారు. శనివారం మండలానికి చెందిన ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... డ్రైవర్లకు లైసెన్స్ ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులతో నడపరాదన్నారు.

రక్తదానం చేయండి.. ప్రాణాలు కాపాడండి



సర్టిఫికెట్లు అందిస్తున్న డాక్టర్ ఫైరోజా బేగం

వాల్మీకిపురం: రక్తదానం చేసి.. ప్రాణాలు కాపాడాలని స్థానిక ప్రభుత్వాసుప్రతి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రధానమంత్రి ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 30మంది రక్తదానం చేశారు. అలాగే ఆసుపత్రిలో 164 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం 22 మంది పంచాయతీ కార్మికులకు కుక్క కరిచినా ఏమి కాకుండా ముందస్తుగా ఏవీఆర్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శనివారం ఐదుగురు స్పెషలిస్ట్ డాక్టర్లచే వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీలక్ష్మి, భారతి, లేఖ్య, సోని, హర్షిత రెడ్డి, అమరావతి, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, మానవతా సంస్థ జిల్లా అధ్యక్షులు క్రిష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గంగమ్మగుడికి తారు రోడ్డు పనులు

కురబలకోట: మండలంలోని తెట్టు పాలేటి గంగమ్మ గుడికి తారు రోడ్డు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. రిషివ్యాలీ నుంచి గంగమ్మ గుడి ద్వారా తెట్టు దళిత వాడ రోడ్డు వరకు తారు రోడ్డు పనులు సర్పంచ్ నులక మనోహర్‌రెడ్డి పూజలు చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి సహకారంతో ఈ రోడ్డుకు ఈఏపీ–3 కింద రూ. 1.19 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఒక కిలోమీటర్ తారు రోడ్డు మరో కిలోమీటర్ సిమెంట్ రోడ్డు వేస్తారని సర్పంచ్ తెలిపారు. రిషివ్యాలీ విద్యార్థులు, ఆధ్యాపకులు రాకపోకలకే కాకుండా వ్యాయామం, వాకింగ్ ఇతర ఆరోగ్య కార్యక్రమాలను ఈ రోడ్డు వరమన్నారు . ఆలయ కమిటీ చైర్మన్ అంజకుమార్, ఈజీఎస్ ఎఫ్ఏ మంజునాథ పాల్గొన్నారు.